# పంచాయతీల్ని కొట్టి కార్యకర్తలకు

**నిధులు ఇందిరమ్మకు మళ్లిస్తున్నారు ❑ స్థానిక సంస్థలు నిర్వీర్యం**
**మీ కుటుంబ సభ్యులే బాగుపడ్డారు ❑ వైఎస్‌కు చంద్రబాబు లేఖ**



హైదరాబాద్, న్యూస్‌టుడే: 'రాష్ట్రంలో మీ ప్రభుత్వం నిరంకుశ వైఖరితో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తూ, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. అప్రజాస్వామిక విధానాలతో పంచాయతీరాజ్ వ్యవస్థను భ్రష్టు పట్టించింది. నేను అధికారంలో ఉన్నప్పుడు వారికిచ్చిన అధికారాలను, నిధులను ఒక్కొక్కటిగా లాగేసుకున్నారు. పంచాయతీలకు రావలసిన రూ.1400 కోట్ల నిధులను అక్రమంగా ఇందిరమ్మ పథకానికి మళ్లించడం శోచనీయం' అని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. మీరు అధికారంలోకి వచ్చిన మొదటి రోజున నిధులు, విధులు, అధికారాలను సర్పంచులకే ఇస్తానని తొలి సంతకంచేసి హామీ ఇచ్చారని, అది ఏమైందని చంద్రబాబు ప్రశ్నించారు. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి మణిశంకర్ అయ్యర్‌తో పది అధికారాలను గత ఏడాది మార్చిలోపు బదిలీ చేస్తానని సంతకం చేసి కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం అటకెక్కిందా? అని అడిగారు. తొలుత వైఎస్‌ను మహాత్మా అని కొనియాడిన మణిశంకర్ ఆ తర్వాత వైఎస్‌పై తిరుగుబాటు చేసి, నిధులు, అధికారాలు సాధించుకోవాలని స్వయంగా పిలుపు ఇవ్వడం పరిస్థితికి నిదర్శనమని చెప్పారు. జీవో నెం.13 ద్వారా విడుదలైన రూ.992 కోట్లను గ్రామ సర్పంచులకు ఇవ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు అప్పగించినట్లు లేఖలో దుయ్యబట్టారు. "ప్రతీ దానికి రాజీవ్ పేరు పెడుతూ మురిసిపోయే మీరు ఆయన చేసిన 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని ఎందుకు నిర్వీర్యం చేశారు?" అని ప్రశ్నించారు. రాజీవ్ వారసులే అయితే 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని అమలు చేసి, ఆర్టికల్ 243 జి 11 షెడ్యూల్‌లోని 29 అంశాలను పంచాయతీలకు, జిల్లా, మండల పరిషత్‌లకు, సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు బదిలీ చేయాలని బాబు డిమాండు చేశారు.

## ఇందిరమ్మ రాజ్యంలో మీ వారే బాగుపడ్డారు

"ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం వచ్చేసిందంటూ డబ్బా కొట్టుకుంటున్నారు. మీ కుమారుడు జగన్‌తోపాటు తోడళ్లుడు, అల్లుడు, తమ్ముడు, అనుంగ అనుచరుడు కేవీపీ ఇళ్లకే ఇందిరమ్మ రాజ్యంలో సౌభాగ్యం కుప్పలుతెప్పలుగా వచ్చిపడింది" అని లేఖలో పేర్కొన్నారు. గ్రామాల్లో కొందరికి పింఛన్లు, ఇళ్లు మంజూరు చేసినంతమాత్రాన సంపూర్ణ గ్రామీణాభివృద్ధి జరగదని, ఆ భ్రమలోంచి బయట పడాలని హితవు పలికారు.